సాక్షి
కాకినాడ

సోమవారం । 18 । నవంబర్ । 2024



రూ.లక్ష విరాళం


మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి నిత్యాన్నదాన ట్రస్టుకు మదరుపు శ్రీనివాస్, వరలక్ష్మి దంపతులు, జస్వంత్ (కడియం) రూ.లక్ష విరాళం సమర్పించారు.



వీధుల్లో పరుగెత్తిస్తున్నాయ్..

ఏ ఊరు.. ఏ వీధి చూసినా కుక్కలే. గుంపులు గుంపులుగా తిరుగుతూ జనానికి దడ పుట్టిస్తున్నాయి. రోడ్డుపైకి రావాలంటే హడలెత్తేలా చేస్తున్నాయి. - 8లో

డెల్టాలకు నీటి విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి ఆదివారం తూర్పు, మధ్య డెల్టాలకు చెరో వెయ్యి, పశ్చిమ డెల్టాకు 1,500 క్యూసెక్కుల చొప్పున గోదావరి నీటిని విడుదల చేశారు. సముద్రంలోకి 17,382 క్యూసెక్కుల మిగులు జలాలను విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

డీఎస్సీ నిర్వహణ అనుమానమే



హసన్ షరీఫ్

కాకినాడ సిటీ: ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు మొదటి సంతకం చేసిన డీఎస్సీ పరీక్షలు ఎప్పుడో స్పష్టత ఇవ్వలేని పరిస్థితుల్లో విద్యాశాఖ మంత్రి ఉన్నారని శాసన మండలి ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ అభ్యర్థి హసన్ షరీఫ్ విమర్శించారు. కాకినాడలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. వచ్చే విద్యా సంవత్సరంలో ఉండవచ్చని మంత్రి అసెంబ్లీలో సమాధానం చెప్పడం చూస్తే డీఎస్సీ నిర్వహిస్తారనేది అనుమానమేనని అన్నారు. అధికారంలోకి వచ్చి ఐదు నెలలు కావస్తున్నా నిరుద్యోగులకు ఇస్తానన్న భృతిపై నేటికీ స్పష్టత లేదని చెప్పారు. గతంలో కూడా ఇలానే ఇంటికో ఉద్యోగం అని ప్రజలను మోసం చేశారన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో ప్రతిపక్షం లేకపోవడంతో ప్రశ్నించే వారు లేక తాము చేస్తున్నదే చెల్లుబాటవుతుందని కూటమి నాయకులు భావిస్తున్నారని షరీఫ్ అన్నారు. ఈ విషయాలను నిరుద్యోగులు గమనిస్తున్నారని చెప్పారు.

జీడిమామిడి బీమాకు 22 వరకూ గడువు

తుని రూరల్: జీడిమామిడి బీమా ప్రీమియం చెల్లింపు గడువును ఈ నెల 22 వరకూ పొడిగించినట్లు ఉద్యాన అధికారి జి.విజయలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ప్రకటించిన గడువు ఈ నెల 15తో ముగిసిందన్నారు. రైతులకు మరింత ప్రయోజనం కల్పించేందుకు ప్రీమియం చెల్లింపు గడువును పెంచారని తెలిపారు.

లోవలో భక్తుల సందడి



లోవ దేవస్థానంలో భక్తుల రద్దీ

తుని రూరల్: తలుపులమ్మ అమ్మవారిని దర్శించేందుకు వచ్చిన భక్తులతో లోవ దేవస్థానంలో ఆదివారం సందడి నెలకొంది. వివిధ జిల్లాల నుంచి వచ్చిన 4 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని ఇన్‌చార్జి డిప్యూటీ కమిషనర్, దేవస్థానం కార్యనిర్వహణ అధికారి పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. కార్తిక మాసం, ఆదివారం కావడంతో వివిధ కళాశాలల విద్యార్థులు దేవస్థానానికి వచ్చి, అమ్మవారిని దర్శించుకున్నారన్నారు. లడ్డూ, పులిహోర ప్రసాదాలు, పూజా టికెట్లు, విరాళాలు, తదితర విభాగాల నుంచి రూ.1,91,811 ఆదాయం సమకూరిందని ఈఓ తెలిపారు.

ఎంటీఎస్ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలి

అమలాపురం టౌన్: 1998 డీఎస్సీ మినిమమ్ టైమ్ స్కేల్ (ఎంటీఎస్) ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని ఆ ఉపాధ్యాయుల రాష్ట్ర సంఘ ప్రతినిధులు రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడికి ఆదివారం వినతిపత్రం అందించారు. రాజోలు పర్యటనకు వచ్చిన మంత్రికి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కేశవకుమార్ ఆధ్వర్యంలో ప్రతినిధులు కలసి తమ డిమాండ్లను వివరించారు. రిటైర్మెంట్ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. కనీస పెన్షన్ ఇవ్వాలని, తమకు 12 నెలల పాటు పూర్తిగా జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

వినియోగించండి ప్లీజ్..

- జిల్లాలో వినియోగంలో లేని బ్యాంకు ఖాతాలు 2,74,488
- యాక్టివ్‌గా లేకపోవడంతో అందని ప్రభుత్వ లబ్ధి
- ఖాతాలను వినియోగంలోకి తెచ్చేందుకు ప్రత్యేక డ్రైవ్
- సచివాలయాల ద్వారా అవగాహన కల్పించేందుకు చర్యలు
- 22 వరకూ గడువు



బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ప్రస్తుత కాలంలో కరెన్సీ లావాదేవీలన్నీ డిజిటల్ బ్యాంకింగ్ రంగంతోనే దాదాపు ముడిపడి ఉన్నాయి. స్మార్ట్ ఫోన్లలో ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం వంటి యాప్‌లు రావడంతో చాలా మంది డిజిటల్ లావాదేవీలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా ప్రభుత్వాలు సంక్షేమ పథకాల ద్వారా అందిస్తున్న ప్రతి రూపాయి లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి ప్రత్యక్ష నగదు బదిలీ (డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ – డీబీటీ) విధానంలో జమ అవుతోంది. ఇటువంటి లావాదేవీలు నిరాటంకంగా జరగాలంటే ప్రతి ఒక్కరికీ బ్యాంకు ఖాతాలు ఉండటమే కాదు.. వాటి ద్వారా నిరంతరం ఏదో ఒక లావాదేవీ జరుగుతూ ఉండాలి. అప్పుడే అవి బతికి (యాక్టివ్‌గా) ఉంటాయి. ఏళ్ల తరబడి నగదు వేయని, తీయని ఖాతాలను బ్యాంకు అధికారులు ఇనాక్టివ్ చేస్తారు. దీనివలన ఖాతాదారులు ముఖ్యంగా ప్రభుత్వ పథకాలు పొందే లబ్ధిదారులు ఇబ్బందులు పడక తప్పదు.

అదే కారణం

కొద్ది రోజుల కిందట జిల్లావ్యాప్తంగా తుపాను పంట నష్టపరిహారం విడుదలైంది, ఇందులో రూ.3 కోట్లకు పైగా లబ్ధిదారుల ఖాతాలకు జమ కాలేదు. దీనికి కారణమేమిటో తెలియక వారు ఆందోళన చెందారు. తమకు పరిహారం జమ కాలేదంటూ ఆయా గ్రామ సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయడం ప్రారంభించారు. దీనిపై పరిశీలన జరిపిన అధికారులు.. ఆయా లబ్ధిదారుల ఖాతాలకు ఆధార్ అనుసంధానం కాకపోవడంతో పాటు, ఖాతా యాక్టివ్‌గా లేకపోవడమే దీనికి కారణమని గుర్తించారు. నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌సీపీఐ) మ్యాపింగ్‌లో ఆయా ఖాతాలకు ఆధార్ అనుసంధానం కాకపోవడంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడం లేదని గమనించారు. ఈవిధంగా జిల్లావ్యాప్తంగా 2,74,488 ఖాతాలు యాక్టివ్‌గా లేవని ఎన్‌పీసీఐ నివేదిక వెల్లడించింది. కొంత మందికి రెండు మూడు ఖాతాలున్నప్పటికీ అవి వినియోగంలో లేకపోవడం కూడా సమస్యలకు దారి తీస్తోంది. దీనిని గుర్తించిన ప్రభుత్వాలు అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడానికి ప్రతి బ్యాంక్ ఖాతా సరిగ్గా పని చేసేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించాయి.

సచివాలయాల వారీగా..

సచివాలయాల వారీగా విభజించి, ప్రతి గ్రామ/వార్డు సచివాలయాల పరిధిలో లబ్ధిదారుల ఖాతాలను డిజిటలైజ్ చేయాలని ప్రభుత్వం ఈ నెల 6న ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారం లబ్ధిదారులతో పాటు 18 సంవత్సరాల వయస్సు నిండిన ఖాతాదారులందరూ ఆయా బ్యాంకులు, తపాలా కార్యాలయాలకు వెళ్లి ఈ-కేవైసీ పూర్తి చేసుకునేలా సంబంధిత సచివాలయ సిబ్బంది అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఎవరికైనా ఖాతాలు లేకపోతే జాతీయ బ్యాంకుల్లో లేదా తపాలా కార్యాలయాల్లో పొదుపు ఖాతాలు తెరవాల్సి ఉంది. అనంతరం సచివాలయ సిబ్బందికి ఇచ్చిన యాప్‌లో ఆయా ఖాతాలను ఎన్‌పీసీఐ నిబంధనల ప్రకారం అప్‌డేట్ చేస్తారు. దీని కోసం అవసరమైతే గ్రామ/వార్డు పరిధిలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఈ మొత్తం ప్రక్రియను ఈ నెల 15వ తేదీలోగా పూర్తి చేయాలని తొలుత ఆదేశించారు. ఆలోగా ఈ ప్రక్రియ పూర్తి కాకపోవడంతో గడువును ఈ నెల 22వ తేదీ వరకూ పొడిగించారు. ఈ ప్రక్రియ పూర్తయితే సంక్షేమ పథకాలను వీలైనంత వరకూ డిజిటల్ లావాదేవీల రూపంలో కచ్చితంగా అందించవచ్చని, దీనివలన ప్రతి పైసాకు లెక్క, జవాబుదారీతనం ఉంటాయని ప్రభుత్వాలు భావిస్తున్నాయి. ప్రభుత్వ ఉత్తర్వుల నేపథ్యంలో తపాలా శాఖ కూడా ప్రత్యేక డ్రైవ్ చేపట్టింది. కేవలం రూ.200తో గ్రామ స్థాయిలో లబ్ధిదారుల ఇంటి వద్దనే ఖాతా ప్రారంభించేలా చర్యలు తీసుకుంటోంది.

అధిక ఖాతాలతో ఇబ్బందులు



జిల్లాలో 2 లక్షలకు పైగా ఖాతాలు వినియోగంలో లేవని గుర్తించాం. కొందరికి రెండు మూడు ఖాతాలున్నా వాటిలో ఏదో ఒకటి మాత్రమే వినియోగిస్తున్నారు. ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకునేటప్పుడు వినియోగంలో లేని ఖాతా నంబర్ ఇవ్వడం సమస్యగా మారింది. ప్రతి లబ్ధిదారూ ఉన్న ఖాతాను సద్వినియోగం చేసుకోవాలి. లేకపోతే మూసేసుకోవాలి. దీనిపై ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. వాటిని అనుసరించి పొదుపు ఖాతాలను సచివాలయ సిబ్బంది వినియోగంలోకి తీసుకురానున్నారు.

– చందాల శ్రీ వెంకట ప్రసాద్, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్, కాకినాడ

పోస్టాఫీసుల ద్వారా ఐపీపీబీ ఖాతాలు



ప్రతి పోస్టాఫీసులో ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంకు (ఐపీపీబీ) ఖాతాలు ప్రారంభించి, ఆధార్ అనుసంధానం చేస్తున్నాం. కాకినాడ డివిజన్‌లోని కాకినాడ, సామర్లకోట ప్రధాన పోస్టాఫీసులతో పాటు 54 సబ్ పోస్టాఫీసులు, 283 బ్రాంచి పోస్టాఫీసులలో సేవలు సద్వినియోగం చేసుకోవాలి.

– సీహెచ్ శ్రీనివాసరావు, పోస్టల్ సూపరింటెండెంట్, కాకినాడ

ప్రైవేట్ పాఠశాలలపై ఒత్తిడి తగదు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): అపార్ ఐడీ జనరేషన్‌పై వివిధ ప్రభుత్వ శాఖలు ప్రైవేట్ పాఠశాలలపై ఒత్తిడి తీసుకు రావడాన్ని యునైటెడ్ ప్రైవేట్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్ ఫెడరేషన్ (యూపీఈఎఫ్) ఆదివారం ఒక ప్రకటనలో ఖండించింది. గడువులోగా పూర్తి చేయాలని ఒత్తిడి తెచ్చి, తప్పులు వస్తే తరువాత జరిగే పరిణామాలకు బాధ్యులెవరో తెలియజేయాలని ఫెడరేషన్ చైర్మన్ డి.దుర్గాశ్రీనివాసరావు ప్రశ్నించారు. ప్రతి గంటకూ సమీక్షలంటూ ఉన్నతాధికారులు ఒత్తిడి తీసుకు రావడం తగదన్నారు. కేంద్ర ప్రభుత్వ వెబ్‌సైట్ అపార్ ఐడీ తప్పనిసరి కాదని పేర్కొన్నా, ఇది తప్పనిసరని అధికారులు చెప్పడం తగదన్నారు. ఈ పని భారం స్కూల్ యాజమాన్యంపై రుద్దడాన్ని ప్రైవేట్ పాఠశాలలు ఖండిస్తున్నాయని తెలిపారు.

అంతర్వేది క్షేత్రం.. భక్తజన సంద్రం



అంతర్వేది ఆలయంలో భక్తుల రద్దీ

సఖినేటిపల్లి: లక్ష్మీనరసింహ స్వామివారి కొలువుదీరిన అంతర్వేది క్షేత్రం భక్తజన సంద్రంలా మారింది. కార్తిక మాసం ఆదివారం సెలవు దినం కావడంతో స్వామివారి దర్శనానికి భక్తులు పిల్లాపాపలతో భారీగా తరలివచ్చారు. అలాగే అయ్యప్ప, భవానీ మాలధారులు వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. పర్యాటకులు, భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. నిత్య నారసింహ సుదర్శన హోమాన్ని ఘనంగా నిర్వహించారు. నిత్యాన్నదాన పథకంలో భోజన వసతిని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ పర్యవేక్షించారు. క్యూలైన్ల ద్వారా స్వామివారి దర్శనానికి వెళ్లే భక్తులకు అసౌకర్యం కలగకుండా దేవస్థానం విస్తృత ఏర్పాట్లు చేసింది.

రత్నగిరిపై భక్తజనవాహిని

- సత్యదేవుని దర్శించిన 80 వేల మంది
- వ్రతాలు 7,904
- ఆదాయం రూ.80 లక్షలు



సత్యదేవుని దర్శనానికి బారులు తీరిన భక్తులు

అన్నవరం: రత్నగిరికి ఆదివారం భక్తజనవాహిని పోటెత్తింది. సత్యదేవుని దర్శనానికి వేలాదిగా భక్తులు తరలి రావడంతో ఆలయ ప్రాంగణంలో తీవ్ర రద్దీ ఏర్పడింది. దీంతో పశ్చిమ రాజగోపురం వద్దనే భక్తులను కంపార్ట్‌మెంట్లలో నిలిపివేసి, బృందాల వారీగా స్వామివారి దర్శనానికి అనుమతించారు. సుమారు 80 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించినట్లు అధికారులు అంచనా వేశారు. సత్యదేవుని ఆలయం, ఆలయ ప్రాంగణం, వ్రత, విశ్రాంతి మండపాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. స్వామివారి ఆలయాన్ని తెల్లవారుజామున రెండు గంటలకు తెరచి పూజలు చేశారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. అర్ధరాత్రి ఒంటిగంట నుంచి వ్రతాలు నిర్వహించారు. అప్పటి నుంచి సాయంత్రం 4 గంటల వరకూ దేవస్థానంలో భక్తుల రద్దీ నెలకొంది. సత్యదేవుని ఉచిత దర్శనానికి సుమారు రెండు గంటల సమయం పట్టింది. అధిక సంఖ్యలో భక్తులు తరలి రావడంతో అంతరాలయం దర్శనాన్ని నిలిపివేసి, భక్తులను వెలుపల నుంచి అనుమతించారు. అలాగే, యంత్రాలయం లోపలకు కూడా అనుమతించకుండా బయటి నుంచే దర్శనాలు కల్పించారు. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేసి, రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించారు. సత్యదేవుని వ్రతాలు 7,904 జరిగాయి. వీటిలో రూ.300 టికెట్టుతో 6 వేలు, రూ.వెయ్యి, రూ.1,500, రూ.2 వేల టికెట్టు వ్రతాలు 1,904 జరిగాయి. వ్రతాల ద్వారానే దేవస్థానానికి రూ.45 లక్షల ఆదాయం సమకూరింది. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి మొత్తం రూ.80 లక్షల ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు. అన్నదాన పథకంలో 8 వేల మంది భక్తులకు పులిహోర, దద్దోజనం, వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఏర్పాట్లను దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ రామచంద్ర మోహన్ పర్యవేక్షించారు.

నేడు కూడా రద్దీ!

కార్తిక మాసంలో మూడో సోమవారం పర్వదినం కావడంతో రత్నగిరిపై తీవ్ర రద్దీ నెలకొనే అవకాశం ఉంది. సుమారు లక్ష మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

నర్సింగ్ పోస్టుల భర్తీ వ్యవహారంలో మలుపులు

- తనకేమీ తెలియదన్న జీజీహెచ్ మేనేజర్
- ఏకంగా కలెక్టరేట్ పైనే ఆరోపణలు
- దీనిపై కలెక్టర్ సీరియస్
- విచారణ పూర్తి.. త్వరలో తదుపరి చర్యలు



కాకినాడ క్రైం: కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో 2020లో కాకినాడ ప్రభుత్వాస్పత్రి(జీజీహెచ్)లో జరిగిన నర్సింగ్ పోస్టుల భర్తీ వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతోంది. ఆ ఏడాది జూన్‌లో 278 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల కాగా డిసెంబర్‌లో నియామకాలు జరిగాయి. ఇందులో జీజీహెచ్ మేనేజర్ వైవీఎస్ఎస్ నరసింగరావు అప్పటి కలెక్టర్‌ను తప్పుదోవ పట్టించి, అర్హులను పక్కన పెట్టి, లంచాలు తీసుకుని, అనర్హులకు పోస్టులు అమ్ముకున్నారని ఆరోపణలు వచ్చాయి. దీనిపై విచారణకు డిప్యూటీ కలెక్టర్, జీజీహెచ్ అడ్మినిస్ట్రేటర్ ఆర్.శ్రీధర్ చైర్మన్‌గా ప్రస్తుత కలెక్టర్ షణ్మోహన్ సగిలి కమిటీని నియమించారు. ఈ ఆరోపణలపై విచారణ జరిపిన కమిటీ తుది నివేదికను ఇటీవల కలెక్టర్‌కు అందజేసింది. ఈలోగా నరసింగరావుపై కలెక్టర్‌కు ఓ అభ్యర్థి గత సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసింది. నరసింగరావు నిర్వాకంతో తాను ఉద్యోగం పొందలేకపోయానని ఆవేదన వ్యక్తం చేస్తూ, అర్హులైన తనవంటి బాధిత అభ్యర్థుల పేర్లను కలెక్టర్‌కు అందజేసింది. ఉద్యోగం పొందేందుకు అన్ని అర్హతలూ ఉన్నప్పటికీ తమకు అన్యాయం జరిగిందని, విచారణలో వెల్లడయ్యే వాస్తవాల ఆధారంగా తనకు ఉద్యోగం ఇచ్చే అవకాశాన్ని పరిశీలించాలని అభ్యర్థించింది. ఈ నేపథ్యంలో ఇప్పటికే పూర్తి చేసిన విచారణకు అనుబంధంగా తాజా ఫిర్యాదుపై కూడా విచారణ జరపాలని, రెండింటికీ కలిపి ఉమ్మడిగా సోమవారం నాటికి తనకు తుది నివేదిక అందించాలని కమిటీ చైర్మన్ శ్రీధర్‌ను కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. మరోవైపు నరసింగరావు తన అనుయాయులతో తమను బెదిరిస్తున్నారని విచారణ బృందం కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లింది. దీంతో ఈ మొత్తం వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించిన కలెక్టర్ విచారణ కమిటీని ప్రభావితం చేస్తున్న వారి పేర్లు, పూర్తి వివరాలు తనకు ఇవ్వాలని కమిటీని ఆదేశించారు. ఇదిలా ఉండగా ఆరోపణలు ఎదుర్కొంటున్న నరసింగరావు తన అనుచరులతో కలిసి ఇటీవల కలెక్టర్ షణ్మోహన్‌ను కలిశారు. తాను అమాయకుడినని, తనకేమీ తెలియదని పేర్కొన్నారు. నర్సింగ్ పోస్టుల విక్రయాల్లో అప్పటి కలెక్టర్, జాయింట్ కలెక్టర్ సహా కలెక్టరేట్ సిబ్బంది ప్రమేయం ఉందనే రీతిలో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఏకంగా కలెక్టరేట్ పైనే ఆరోపణలు చేయడాన్ని కలెక్టర్ షణ్మోహన్ తీవ్రంగా పరిగణించారు. దీనిపై విచారణ జరిపి త్వరితగతిన తనకు తుది నివేదిక ఇవ్వాలని విచారణ కమిటీని ఆదేశించారు. ఈ మేరకు కమిటీ శుక్రవారం నాటికే విచారణ పూర్తి చేసి కలెక్టర్‌కు తుది నివేదికను అందించింది. దీనిలోని కీలక అంశాలను ప్రాథమికంగా పరిశీలించిన కలెక్టర్.. నర్సింగ్ పోస్టుల విక్రయాల్లో కలెక్టరేట్ ప్రమేయం ఏమాత్రం లేదని స్పష్టతకు వచ్చారు. ఏకంగా కలెక్టరేట్ పైనే బురద జల్లేందుకు నరసింగరావు ప్రయత్నించడాన్ని తీవ్రంగా పరిగణించారు. నర్సింగ్ పోస్టుల విక్రయాల ఆరోపణలపై విచారణ అత్యంత పారదర్శకంగా జరిగిందని, కలెక్టరేట్‌పై జీజీహెచ్ మేనేజర్ చేసిన ఆరోపణల్లో వాస్తవాలు లేవని కలెక్టర్ షణ్మోహన్ స్పష్టం చేశారు. నివేదికలోని అంశాల ఆధారంగా త్వరలో తదుపరి చర్యలు చేపడతామని తెలిపారు.

ఆయ్.. రారండోయ్..

- ప్రకృతి శిల్పం.. కోనసీమ ప్రాంతం
- ఆధ్యాత్మిక, ఆహ్లాద కేంద్రంగా జిల్లా
- కార్తికంలో వన భోజనాలకు ప్రత్యేకం
- పర్యాటకుల సందడితో కళకళ



బడుగువానిలంక వద్ద గౌతమీ గోదావరి తీరంలో వన సమారాధనకు హాజరై పూల తోటలను తిలకిస్తున్న పర్యాటకులు

ఆలమూరు/ సఖినేటిపల్లి/ మలికిపురం/ అల్లవరం/ తాళ్లరేవు: ప్రకృతి చెక్కిన శిల్పం కోనసీమ ప్రాంతం.. ఎన్నో అందాలు దీని సొంతం.. స్వర్గసీమను తలపించే పచ్చదనం ఇక్కడ ప్రత్యేకం.. ఈ జిల్లా ఆతిథ్య, ఆధ్యాత్మిక, ఆనందానికి కేంద్రం.. అలాంటి సీమను చూసేందుకు రెండు కనులూ చాలవు. సరిపోవు. అందుకే కార్తిక మాసంలో ఇక్కడి అందాలను తిలకించేందుకు పర్యాటకులు తరలి వస్తుంటారు.. గలగల పారే గోదావరి.. పచ్చని పైర్లు.. కొబ్బరి తోటలు.. ఒంపులు తిరుగుతూ వెళ్లే కాలువలు.. సాగర తీర ప్రాంతాలు.. ఆధ్యాత్మిక పంచే పుణ్యక్షేత్రాలు ఇక్కడ ప్రత్యేకం. కోనసీమ గురించి ఎంత చెప్పినా తక్కువే. ఆయ్ రారండోయ్ అంటూ పిలుస్తున్న జిల్లా గురించి తెలుసుకుందాం రండి..

శివకేశవులకు ఎంతో ప్రీతికర మాసం కార్తికం. ప్రతి ఒక్కరి మనసుకు ఆహ్లాదం, ఆనందం, ఆధ్యాత్మికతను పంచే ఈ మాసంలో ప్రకృతి ఒడిలో ఒదిగిపోవాలని అందరూ భావిస్తుంటారు. అలాంటి వారికి జిల్లా ఆతిథ్యాన్ని అందిస్తోంది. ప్రధానంగా ఆధ్యాత్మికంగా జిల్లాలో రామచంద్రపురం మండలం ద్రాక్షారామలో శ్రీపార్వతీ సమేత భీమేశ్వర స్వామి ఆలయం, కొత్తపేట మండలం పలివెలలో పురాణ ప్రసిద్ధి గాంచిన ఉమా సమేత కొప్పేశ్వర స్వామి, మురమళ్లలో భద్రకాళీ సమేత వీరేశ్వర స్వామి, ఆలమూరులో శతాబ్దాల చరిత్ర కలిగిన విక్రమ భట్టీశ్వరస్వామి ఆలయం, పెనికేరులో వెలసిన ఇష్ట కాంతేశ్వరస్వామి, కోటిపల్లిలో విశ్వేశ్వర స్వామి, జొన్నాడలో దక్షిణ కాశీగా ప్రసిద్ధి గాంచిన కాశీ అన్నపూర్ణా సమేత శ్రీవిశ్వేశ్వర స్వామి తదితర శైవక్షేత్రాలు పేరుగాంచాయి. ఇక్కడ కార్తికంలో ప్రతి సోమవారం భక్తుల రద్దీ ఉంటోంది.

పర్యాటకం... ప్రత్యేకం

జిల్లాలో అనేక పర్యాటక ప్రాంతాలు ఉన్నాయి. ఇక్కడి గోదావరి అందాలతో పాటు సాగర తీర ప్రాంతాలు అందరినీ ఆకర్షిస్తున్నాయి. సఖినేటిపల్లి మండలంలో అంతర్వేది సాగర సంగమం, మలికిపురం మండలంలో కేశనపల్లి, తూర్పుపాలెం, ఉప్పలగుప్తం మండలంలో ఎస్.యానాం, అల్లవరం మండలంలో ఓడలరేవు తదితర బీచ్‌లు పర్యాటకులతో కళకళలాడుతున్నాయి. తెలుగు రాష్ట్రాల నుంచి అనేక మంది ఇక్కడకు వచ్చి సరదాగా గడుపుతున్నారు. ఆయా బీచ్‌ల సమీపంలోని సరుగుడు తోటల్లో వన సమారాధనలు ఏర్పాటు చేసుకుని ఆటపాటలతో సందడి చేస్తున్నారు. దీంతో పాటు గౌతమీ, వశిష్ఠ, వైనతేయ నదీ తీరాల వెంబడి ఉన్న ప్రదేశాలను పర్యాటకులు సందర్శిస్తున్నారు. ఆత్రేయపురం మండలంలో లొల్ల లాకులు, కపిలేశ్వరపురం మండలం కేదార్లంకలో ధనమ్మమర్రి, మండపేట మండలం కేశవరంలో గనిపోతురాజు ఆలయం, రాయవరం మండలం సోమేశ్వరంలోని తలుపులమ్మ లోవ ఆధ్యాత్మికతతో పాటు వన భోజనాలకు వేదికలవుతున్నాయి. ఆలమూరు మండలం బడుగువానిలంకలో ఆదివారం జరిగిన యెరుబండి వంశీయుల వన సమారాధనలో తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు మూడు వేల మంది హాజరయ్యారు. ఆటపాటలతో సందడి చేశారు.

కోరంగి.. మనసు ఉప్పొంగి



కోరంగి అభయారణ్యంలో పర్యాటకులు

కాకినాడ జిల్లా కోరంగి అభయారణ్యానికి ప్రత్యేక స్థానం ఉంది. ఇక్కడ మడ అడవులను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దారు. మడ అడవుల మధ్యలో నుంచి చెక్కల వంతెనల మీదుగా నడుస్తూ ప్రకృతి అందాలను తిలకించడం కొత్త అనుభూతిని ఇస్తుంది. ఇక్కడ రకరకాల పక్షులు, నీటి పిల్లులు, వివిధ జంతువులు పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి. కుటుంబ సమేతంగా వెళ్లేందుకు ఇక్కడ బోట్లు ఏర్పాటు చేశారు. సాధారణ రోజుల్లో వెయ్యి, సెలవు దినాల్లో సుమారు రెండు వేల మంది వరకూ వస్తుంటారు. ఇక్కడి విశేషాలను తెలిపేలా మినీ థియేటర్ కూడా ఏర్పాటు చేశారు.

దిండి.. పదండి



దిండి రిసార్ట్స్‌లో బోట్ షికారు

మలికిపురం మండలం దిండి రిసార్ట్స్‌కు రాష్ట్ర వ్యాప్తంగా పేరుంది. ఇది పర్యాటకంగా ఎంతో అభివృద్ధి చెందింది. ఇక్కడ హౌస్ బోట్లు, ఫాంటూన్ బోట్లు గోదావరిలో షికారుకు ఏర్పాటు చేశారు. స్విమ్మింగ్ పూల్స్, రిసార్ట్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. రోజుకు వెయ్యి మందికి పైగా ఇక్కడకు వచ్చి ప్రకృతి అందాలకు మంత్రముగ్ధులవుతున్నారు. దేశ, విదేశాల నుంచి పర్యాటకులు రావడం విశేషం. అంతేకాకుండా ఇక్కడ అనేక సినిమాలు చిత్రీకరించారు.

అంతర్వేది.. ఆహ్లాదానికి విడిది



అంతర్వేది బీచ్‌లో పర్యాటకుల సందడి

అంతర్వేది పుణ్యక్షేత్రం లక్ష్మీనృసింహుడు కొలువుదీరిన ప్రాంతం. ఇక్కడ ఆధ్యాత్మికత వెల్లివిరిస్తోంది. అలాగే అంతర్వేది బీచ్, సాగర సంగమ ప్రాంతం పర్యాటకులకు ఆహ్లాదాన్ని పంచుతోంది. ఈ కార్తికంలో మరింత రద్దీగా మారుతోంది. శని, ఆదివారాల్లో సుమారు పది వేల నుంచి 20 వేల మంది వరకూ భక్తులు, పర్యాటకులు రావడం విశేషం. ఇక్కడ అటు భక్తిభావం, ఇటు ఆహ్లాదం కట్టిపడేస్తోంది. సముద్రంలో పిల్లాపాపలతో స్నానాలు చేస్తూ కేరింతలు కొట్టే యువత రోజురోజుకూ పెరుగుతోంది.

తీరం.. ఆనంద సాగరం



ఓడల రేవు బీచ్‌లో రద్దీ

అల్లవరం మండలం ఓడలరేవు సముద్ర తీరం పర్యాటకులను ఎంతో ఆకర్షిస్తోంది. ఇక్కడ పిల్లా పాపలతో సముద్రంలో స్నానాలు ఆచరించి సకుటుంబ సమేతంగా సరుగుడు తోటల్లో కార్తిక వన భోజనాలు చేసుకుంటున్నారు. సాయం సంధ్యా సమయం వరకూ ఉండి జీవితంలో మధుర క్షణాలను లిఖించుకుంటున్నారు. వేలాదిగా వచ్చే పర్యాటకుల దృష్ట్యా తీరంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు గస్తీ నిర్వహిస్తున్నారు.

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి పోటీలకు గురుకులం విద్యార్థులు



సాధించిన కప్పుతో జోనల్ స్థాయి క్రీడల్లో ఉత్తమ ప్రతిభ చాటిన క్రీడాకారులు

అల్లవరం: ఉమ్మడి కృష్ణా జిల్లాలో మూడు రోజుల పాటు జరిగిన ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జోనల్ స్థాయి స్పోర్ట్స్ మీట్‌లో అల్లవరం మండలం గోడి బాలుర గురుకులానికి చెందిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. సీనియర్ ఇంటర్ విద్యార్థి ఎస్.సతీష్‌కుమార్ జావెలిన్ త్రో, డిస్కస్ త్రో క్రీడల్లో ప్రథమ స్థానంలో నిలిచారు. డిస్కస్ త్రోలో కె.బాబీ ద్వితీయ స్థానం సాధించారు. జూనియర్స్ జావెలిన్ త్రో పోటీలో సీహెచ్ క్రాంతి కిరణ్ ప్రథమ స్థానం, హ్యాండ్ బాల్ విభాగంలో పదో తరగతికి చెందిన ప్రదీప్, క్రాంతికుమార్, అభిషేక్, గౌతమ్, చరణ్ సాయి, సాత్విక్, వంశీలు విజేతలుగా నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విజేతలను ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు పిఠాపురం బాక్సర్లు



ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న కోచ్ లక్ష్మణరావు

పిఠాపురం: ఈ నెల 16వ తేదీన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా తాటిపాకలో నిర్వహించిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్‌లో పిఠాపురం క్రీడాకారులు విశేష ప్రతిభ కనబర్చినట్లు కోచ్ పి.లక్ష్మణరావు తెలిపారు. బాక్సింగ్ అండర్- 17 బాల బాలికల విభాగంలో పిఠాపురం లిటిల్ సోల్జర్స్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న బి.నాగరుతిక 46 కిలోల విభాగం, భాష్యం స్కూల్లో 9వ తరగతి చదువుతున్న జీఆర్ అరుణ్ 70 కిలోల విభాగంలో ప్రతిభ చాటారన్నారు. వీరిద్దరూ ఈ నెల 19వ తేదీ నుంచి 21వ తేదీ వరకూ ఉమ్మడి కృష్ణా జిల్లా మచిలీపట్నంలో జరగనున్న 68వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ బాక్సింగ్ పోటీలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి పాల్గొంటారని కోచ్ పి.లక్ష్మణరావు తెలిపారు. ఎంపికైన బాక్సర్లను డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ బి.శ్రీనివాస్ కుమార్, కాకినాడ జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ ఎల్.జార్జ్ అభినందించారు.

లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

చాగల్లు: చాగల్లు మండలం దారవరంలో బాలికపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎస్సై కె.నరేంద్ర తెలిపారు. నిడదవోలు మండలం సమిశ్రగూడెం ఎస్సీ బాలికల వసతి గృహంలో చదువుతున్న 14 ఏళ్ల బాలికపై వరుసకు మేనమామ అయిన పట్టెంపాలెం గ్రామానికి చెందిన సనమండ్ర కమల్ ఈ నెల 14న దారవరంలో లైంగిక దాడి చేశాడు. ఈ ఘటనలో నిందితుడైన కమల్‌ను ఆదివారం కొవ్వూరు డీఎస్పీ జి.దేవకుమార్ అరెస్టు చేసినట్టు ఎస్సై కె.నరేంద్ర తెలిపారు. నిందితుడిని నిడదవోలు కోర్టులో హాజరుపరిచామన్నారు.

వీధుల్లో పరుగెత్తిస్తున్నాయ్..

- పెరిగిన వీధి కుక్కల దాడులు
- నియంత్రణకు ప్రభుత్వ చర్యలు శూన్యం
- రెండు శాఖల మధ్య సమన్వయ లోపం

అలమూరు: ఏ ఊరు.. ఏ వీధి చూసినా కుక్కలే. గుంపులు గుంపులుగా తిరుగుతూ జనానికి దడ పుట్టిస్తున్నాయి. రోడ్డుపైకి రావాలంటే హడలెత్తేలా చేస్తున్నాయి. రాత్రి వేళల్లో పరిస్థితి మరింత దయనీయంగా మార్చుతున్నాయి. ఏదైనా పనిపై బయటకు వెళ్లాలంటే చాలు వీధి కుక్కలు పరుగులు పెట్టిస్తున్నాయి. కుక్కల దాడి ఘటనలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పెరిగిపోయాయి. నగరం, పట్టణం, గ్రామమనే తేడా లేకుండా గ్రామ సింహాలు దర్జాగా తిరుగుతున్నాయి. వీటి నియంత్రణకు ప్రభుత్వం నిర్దిష్టమైన చర్యలు తీసుకోకపోవడంతో రోజూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో అనేక కుక్కకాటు కేసులు నమోదవుతూనే ఉన్నాయి. వందల మంది క్షతగాత్రులవుతుండగా, పలువురు మృత్యువాత పడుతున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని వివిధ మండలాల్లో 385 గ్రామాలు, ఒక నగర పంచాయతీ, మూడు మున్సిపాలిటీలు ఉన్నాయి. ఇక్కడ సుమారు 20 వేల వరకూ వీధి కుక్కలు ఉన్నట్లు పశుసంవర్థక శాఖ గణాంకాల ద్వారా తెలుస్తోంది. మండల పరిషత్ సమావేశాలు జరిపినప్పుడు ఈ వీధి కుక్కల బెడదపై ప్రత్యేకంగా చర్చిస్తున్నా ఫలితం ఉండడం లేదు. పంచాయతీరాజ్, పశుసంవర్థక శాఖల మధ్య బాధ్యులు మీరంటే మీరంటూ ఒక్కోసారి వాదనకు దిగుతున్నారు. అప్పటికప్పుడు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు సర్దిచెప్పి కుక్కల బెడద సమస్యను దాట వేయడం పరిపాటిగా మారింది. వీధి కుక్కల నియంత్రణకు మున్సిపాలిటీల్లో ప్రత్యేక వ్యవస్థ ఉండగా, గ్రామ పంచాయతీల్లో ఆ పరిస్థితి లేకపోవడంతో పాటు నిధుల లేమి వెంటాడుతోంది. కుక్కల సంతతి నియంత్రణకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించకపోతే జనం భయంతో జీవనం సాగించాల్సిందే.

ఏం చేయాలంటే..

సాధారణంగా ఆడ కుక్కలు ఏడాదిలో రెండు సార్లు గర్భం దాల్చుతుంటాయి. ఒక ఆడ కుక్క ఒక్కో కాన్పులో సుమారు ఏడెనిమిది పిల్లలకు జన్మనిస్తుంది. దీంతో కుక్కల సంఖ్య ఏమాత్రం తగ్గకుండా ఏటా పెరిగిపోతూ వస్తుంది. కుక్కల సంతాన ఉత్పత్తి నియంత్రణ (యానిమల్ బర్త్ కంట్రోల్)తోనే వీధి కుక్కల బెడదను నివారించవచ్చని పశుసంవర్థక శాఖ చెబుతుంది. వీటి నియంత్రణకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలి. గ్రామ పంచాయతీల్లో కాని, పురపాలక సంఘాల్లో కాని కుక్కలు ఎక్కడెక్కడ ఉంటాయో స్థానిక సంస్థల సిబ్బంది సహకారంతో గుర్తించాలి. కుక్కలు పట్టుకునే (డాగ్ క్యారియర్స్) వారిని నియమించుకుని, వాటికి ఏబీసీతో పాటు ఏఆర్‌వీ వ్యాక్సిన్‌ను అందించాలి. నగరాల్లో కొన్నిచోట్ల పశుసంవర్థక శాఖ సిబ్బంది ఆయా ప్రాంతాలకు వెళ్లి కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేస్తున్నా గ్రామ పంచాయతీల్లో మాత్రం ఆ పరిస్థితి లేదు.

ఏఆర్‌వీ వ్యాక్సిన్ సురక్షితం

రేబిస్ లక్షణాలున్న కుక్కలు కరిచినప్పుడు ఆ వైరస్ ప్రభావం మనిషి కేంద్ర నాడీ వ్యవస్థపై పడుతుంది. ముఖం, వెన్నెముక భాగాల్లో కరిస్తే వైరస్ నాడీ వ్యవస్థకు వేగంగా వ్యాపిస్తుంది. కాలు, తొడ, చేయి భాగాలపై కరిచినప్పుడు కొంత ఆలస్యంగా వైరస్ నాడీ వ్యవస్థను చేరుకుంటుంది. రేబిస్ లక్షణాలు బయటపడిన తర్వాత నయం చేయడానికి ఎలాంటి వైద్యం లేదు. వ్యాధి కారక లీసా వైరస్ కుక్కల్లోనే కాకుండా పిల్లులు, నక్కలు, గబ్బిలాల్లోనూ ఉంటుంది. ఏది కరిచినా వెంటనే టీటీ ఇంజక్షన్ చేయించుకోవాలి. వీటి దాడిలో తీవ్ర గాయాలైన క్షతగాత్రులు సత్వరమే సమీప ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి యాంటీ రేబిస్ వ్యాక్సిన్ (ఏఆర్‌వీ) తీసుకోవాలి. గాయాల తీవ్రత ఎక్కువ ఉన్నవారు మెరుగైన ప్రత్యేక చికిత్స తీసుకోవడం ద్వారా ప్రాణాప్రాయ పరిస్థితిని తప్పించుకోవచ్చు. చికిత్స విధానంలో నిర్లక్ష్యం చేస్తే ఒక్కోసారి ప్రాణాలకే ముప్పు. పెంపుడు కుక్కల యజమానులు వాటికి పుట్టిన నెల రోజుల వ్యవధిలో యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేయించాలి. నెల తర్వాత బూస్టర్ డోస్ వేయించుకుంటే రేబిస్ వ్యాధి నుంచి రక్షణ పొందవచ్చు.



ఏ ఊరు చూసినా ఇలా వీధి కుక్కలు



కలచవర్లలో కుక్కకాటుకు గురైన వృద్ధుడు(ఫైల్)



ఆలమూరులో పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్ వేస్తున్న జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి వెంకట్రావు (ఫైల్)

రేబిస్ కుక్క లక్షణాలు

రేబిస్ లక్షణాలున్న కుక్కలు విచిత్రంగా ప్రవరిస్తాయని పశు వైద్యాశాఖ నిపుణులు చెబుతున్నారు. అలాంటి కుక్క వింతగా ప్రవర్తించడం, ఉద్రేకంగా కనిపించడం, నోటి నుంచి ఎక్కువగా చొంగ కారడం వంటి లక్షణాలు ఉంటాయి. మానవులైనా, జంతువులైనా దూకుడుగా వెళ్లి దాడి చేయడానికి చూస్తుంది. చలనం లేని వస్తువులను కరవడం వంటి లక్షణాలు 90 శాతం రేబిస్ కుక్కలలో ఉండే అవకాశం ఉంది. ఇలాంటి లక్షణాలు లేకుండానే మరికొన్ని నీరసంగా నిర్లిప్తంగా ఉంటాయి. ఎటువంటి ఆహారాన్ని తీసుకోవు. రెండు, మూడు రోజుల తర్వాత చనిపోతాయి. ఈ కుక్కలు కరిస్తే వెంటనే చికిత్స చేయించుకోవాలి.

చికిత్సా విధానం ఇలా..

ఏ కుక్క కరిచినా వెంటనే గాయాన్ని డెటాల్, స్పిరిట్, సబ్బుతో శుభ్రం చేయాలి. గాయంలో ఉన్న వైరస్‌ను నిర్మూలించడానికి కార్బలిక్ యాసిడ్ ఉపయోగపడుతుంది. కుక్క కరిచిన భాగాన్ని వేగంగా నీళ్లు వచ్చే కుళాయి కింద ఉంచాలి. రక్తం బయటకు పోయేలా కాటు పడిన భాగం వద్ద గట్టిగా నొక్కాలి. శుభ్రం చేసిన తర్వాత పది నిమిషాలు ఎండ తగిలేలా ఉంచాలి. కుక్క కాటు వేసిన రోజు నుంచి దశల వారీగా ఏఆర్‌వీ ఇంజక్షన్ చేయించుకోవాలి. గాయమైన రోజున తొలి డోసు వేయించుకోవాలి. 3, 7, 14, 21వ రోజున తిరిగి ఇంజక్షన్ తీసుకోవాలి. గాయమైన 90వ రోజున కూడా ఈ ఇంజక్షన్ తీసుకుంటే చక్కని ఫలితం ఉంటుంది.

జిల్లాలో ఐదేళ్లలో కుక్కకాటు కేసులు		
2019-20	:	18,958
2020-21	:	19,698
2021-22	:	20,878
2022-23	:	24,297
2023-24	:	27,312
		(2024 అక్టోబర్ 31 వరకూ)

ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు



"వీధి కుక్కల సంతానోత్పత్తి నియంత్రణకు ప్రభుత్వం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేస్తుంది. జిల్లా కేంద్రమైన అమలాపురంలో కుక్కల నియంత్రణకు సంబంధించి కార్యాలయం ఏర్పాటు చేశాం. పంచాయతీరాజ్, పురపాలక సంఘ అధికారులతో కలిసి సమర్థవంతంగా కుక్కల నియంత్రణకు ఏబీసీ వ్యాక్సిన్ అందేలా చర్యలు తీసుకుంటాం."

– కె.వెంకట్రావు, జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి

బాలల హక్కులకు భంగం కలిగిస్తే చర్యలు



సదస్సులో మాట్లాడుతున్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు ఆదిలక్ష్మి

పిఠాపురం: బాలల హక్కులకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు టి.ఆదిలక్ష్మి అన్నారు. బాలల హక్కులు, ప్రజా చైతన్య వారోత్సవాల్లో భాగంగా మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో పిఠాపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఆదివారం విద్యార్థులకు బాలల హక్కులు, బాలల పరిరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ 1989లో బాలల హక్కులపై ఐక్యరాజ్య సమితి తీర్మానం చేసిందన్నారు. బాలలకు జీవించే, అభివృద్ధి చెందే, రక్షణ పొందే, పాల్గొనే హక్కులు ఉన్నాయన్నారు. వీరిపై లైంగిక దాడులు జరగకుండా అందరూ బాధ్యత తీసుకోవాలన్నారు. బాలల హక్కులకు భంగం కలిగించినా, బాల్య వివాహాలు జరుగుతున్నా వాటిని నిలుపుదల చేయాలన్నారు. బాల్య వివాహాలకు సహకరించిన వారికి రూ.లక్ష జరిమానా, రెండేళ్ల జైలు శిక్ష ఉంటుందని హెచ్చరించారు. బాలలు బడికి వెళ్లి చదువుకోవాలని, ఎన్నో మధుర జ్ఞాపకాలు మిగిల్చే బాల్యానికి మూడుముళ్ల బంధం వేయరాదన్నారు. బాల్య వివాహాలతో మాతా శిశు మరణాలు సంభవిస్తాయని, పౌష్టికాహార లోపం, రక్తహీనత వంటి సమస్యలు తలెత్తుతాయన్నారు. అమ్మాయిలు ప్రేమ పేరుతో మోసపోవద్దని, అపరిచితులు ఎవరైనా వెంబడిస్తే రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. బాల్య వివాహాలు, బాలల వేధింపులు, బాల కార్మికులు ఉంటే వెంటనే చైల్డ్‌లైన్ నంబరు 1098కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు. చైల్డ్ హెల్ప్ లైన్ 1098 జిల్లా ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ చిన్నతనంలో బాల్య వివాహాలు చేసినా, ఎక్కడైనా భిక్షాటన చేస్తున్న పిల్లలు కనిపించినా చైల్డ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలన్నారు. పిల్లలపై ఏవిధమైన అసభ్యకరమైన ఫొటోలు తీసి ఆన్‌లైన్లో పోస్టింగ్స్ పెట్టినా, ప్రేమ పేరుతో ఎవరైనా వేధించినా, మానసికంగా, శారీరకంగా వేధించినా తెలపాలన్నారు. కార్యక్రమంలో శిశు గృహ మేనేజర్ నూకరత్నం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో వైఎస్సార్ సీపీ నాయకులు



తుని రూరల్ పోలీస్ స్టేషన్‌లో వైఎస్సార్ సీపీ నాయకులు, సోషల్ మీడియా ప్రతినిధి

తుని రూరల్: ప్రభుత్వానికి వ్యతిరేకంగా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారనే అనుమానంతో తుని రూరల్ పోలీసులు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. తేటగుంట గ్రామానికి చెందిన గణేసుల వీరబాబును రూరల్ పోలీసులు శనివారం రాత్రి 11 గంటల వరకూ స్టేషన్‌లోనే ఉంచారు. అర్ధరాత్రి ఇంటికి పంపించి మళ్లీ ఆదివారం ఉదయమే స్టేషన్‌కు రప్పించి రాత్రి వరకూ అక్కడ ఉంచారు. అదేవిధంగా కోటనందూరు మండలం వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు, అప్పలరాజుపేటకు చెందిన సోషల్ మీడియా కార్యకర్త బంగారు బ్రహ్మనాయుడిని పోలీసులు రూరల్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. దీనిపై రూరల్ ఎస్సై బి.కృష్ణమాచారిని వివరణ కోరగా వారిపై కేసు నమోదు చేయాల్సి ఉందని, రాత్రికి ఇళ్లకు పంపించి వేస్తున్నట్టు తెలిపారు. సోమవారం సాంకేతిక నిపుణులు సెల్‌ఫోన్లలో సమాచారాన్ని పరిశీలించిన తర్వాత తగు చర్యలు తీసుకుంటామని ఎస్సై వివరించారు.

ఘనంగా 'సాహితీ' కార్తిక సమారాధన



హాజరైన సాహితీ ప్రముఖులు



సాహితీ సమారాధనలో మాట్లాడుతున్న జక్కంపూడి రాజా, చిత్రంలో ఆకుల వీర్రాజు తదితరులు

కడియం: కార్తిక మాసం అనగానే మనకు నోరూరించే వంటకాలతో సహపంక్తి భోజనాలే గుర్తుకు వస్తాయి. ఆ విందు భోజనాలతో పాటు సాహితీ వంటకాలను కూడా వడ్డించారు కడియం గ్రామానికి చెందిన బోణం సత్యనారాయణ. ఆయన ఆదివారం స్థానిక తమ నర్సరీలో సాహితీ కార్తిక సమారాధన ఏర్పాటు చేశారు. రాజమహేంద్రవరం నుంచి పలువురు కవులు, రచయితలు, పండితులను, వారితో పాటు స్థానిక చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి కళాసేవా సమితి సభ్యులను, హిందూ ధర్మ ప్రచార సమితి కార్యకర్తలను ఆహ్వానించి కవి సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఆహూతులకు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత చిలుకూరి శ్రీనివాసరావు ఆహ్వానం పలుకగా, సాహిత్య సభకు బులుసు సత్యనారాయణమూర్తి అధ్యక్షత వహించారు. డాక్టర్ డి.నీలకంఠరావు పర్యవేక్షణలో జరిగిన ఈ సాహితీ సమ్మేళనంలో యాభై మంది కవులు తమ రచనలను వినిపించారు. కొందరు మహిళామణులు చక్కని గీతాలు ఆలపించారు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు, కడియం ఉప సర్పంచ్ వెలుగుబంటి రఘురామ్‌లు హాజరై మాట్లాడారు. కవిత్వానికి ఆదరణ తగ్గిపోతున్న ఈ కాలంలో ఇలాంటి సమావేశాలు చాలా అవసరమన్నారు. దీనివల్ల ప్రజల్లో ఐకమత్యంతో పాటు సాహిత్యాభిలాష పెరుగుతుందని అన్నారు. నాయకులు అడపా సుబ్రహ్మణ్యం, ఆదిత్య కళాశాలల కరస్పాండెంట్ గంగిరెడ్డి, నాగిరెడ్డి, కొత్తూరి కృష్ణ, సుదర్శన్, ఖాదర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం బోణం సత్యనారాయణ దంపతులను ఘనంగా సత్కరించారు.

హాకీ పోటీల్లో ఫైనల్స్‌కు 'తూర్పు జట్టు'



అండర్-19 హాకీ పోటీల్లో తలపడుతున్న తూర్పుగోదావరి జిల్లా బాలుర జట్టు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): పాఠశాల క్రీడా సమాఖ్య అండర్-14, 17 ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో అండర్-19 అంతర్ జిల్లాల ఎస్‌జీఎఫ్ఐ హాకీ పోటీల్లో తూర్పు గోదావరి జిల్లా బాలుర జట్టు ఫైనల్స్‌కు చేరిందని టోర్నమెంట్ నిర్వహణా కార్యదర్శి ఎల్.జార్జి ఆదివారం తెలిపారు. సెమీ ఫైనల్స్‌లో తూర్పు జట్టు కడపపై విజయం సాధించిందన్నారు. సోమవారం మూడో స్థానానికి కడప, అనంతపురం జట్లు, మొదటి, రెండు స్థానాలకు విశాఖ, తూర్పు జట్లు పోటీ పడతాయన్నారు. బాలికల విభాగంలో ఫైనల్ మ్యాచ్ తూర్పు, అనంతపురం జట్ల మధ్య, మూడో స్థానానికి విశాఖ, కడప జట్లు పోటీ పడతాయన్నారు. ఆదివారం నిర్వహించిన మ్యాచ్‌లను పీడీలు రవిరాజు, సునీల్ పర్యవేక్షించారు.

భజే విఘ్న నాయకా..



స్వామివారి నిత్యాన్నదాన పథకంలో అన్న ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

అయినవిల్లి: భజే విఘ్న నాయకా.. అంటూ ఆ అయినవిల్లి విఘ్నేశ్వర స్వామివారిని భక్తులు కొలిచారు. ఆదివారం, ఆపై కార్తిక మాసం కావడంతో స్వామివారి దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో స్వామికి మేలుకొలుపు సేవ, పంచామృతాభిషేకాలు, వివిధ పూజలు చేశారు. స్వామికి మహానివేదన అనంతరం వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామివారి లఘున్యాస, ఏకాదశ రుద్రాభిషేకాల్లో 163 మంది, పంచామృతాభిషేకాల్లో ఒక జంట, లక్ష్మీగణపతి హోమంలో 25 మంది భక్త దంపతులు పాల్గొన్నారు. 41 మంది చిన్నారులకు తులాభారం, వేదాశీర్వచనం చేశారు. ముగ్గురు తలనీలాలు సమర్పించగా, 37 మంది నూతన వాహన పూజ చేయించుకున్నారు. అన్నదాన పథకంలో 5,115 మంది అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయానికి వివిధ పూజలు, అన్నదాన విరాళాలుగా రూ.4,01,003 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

క్రైమ్ థ్రిల్లర్ సినిమా 'జీబ్రా'

హీరో సత్యదేవ్



విలేకరులతో మాట్లాడుతున్న జీబ్రా సినిమా హీరో సత్యదేవ్, చిత్రంలో నటి జెన్నీఫర్, హాస్యనటుడు భద్రం

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): జీబ్రా చిత్రాన్ని ఫైనాన్షియల్ క్రైమ్ థ్రిల్లర్‌గా, మాస్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కించామని హీరో సత్యదేవ్ వెల్లడించారు. సినిమా ప్రచారంలో భాగంగా ఆదివారం స్థానిక షెల్టాన్ హోటల్‌లో ఏర్పాటైన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను తొలిసారిగా రాజమహేంద్రవరానికి రావడం ఎంతో ఆనందంగా ఉందని సత్యదేవ్ అన్నారు. ఓల్డ్ టౌన్ పిక్చర్స్, పద్మజ ఫిల్మ్ ప్రైవేట్ ఆధ్వర్యంలో నిర్మించిన జీబ్రా చిత్రానికి ఈశ్వర్ కార్తీక్ రచించి దర్శకత్వం వహించారన్నారు. బెల్జియం దేశానికి చెందిన నటి జెన్నీఫర్‌తో పాటు, డాలీధనుంజయ, సత్యరాజ్, ప్రియభవానిశంకర్, సునీల్, అమృత్ అయ్యంగార్ ముఖ్యపాత్రలు పోషించారన్నారు. తన అమ్మమ్మది పశ్చిమగోదావరి జిల్లా భీమడోలు అని, తనకు గోదావరి జిల్లాలతో ఎంతో అనుబంధం ఉందన్నారు. గోదావరి జిల్లాల ప్రజలకు సినిమాలు అంటే ఎంతో ప్రేమ అన్నారు. జీబ్రా చిత్రం బహుభాషా చిత్రంగా విడుదల కానుందని, తమ జీబ్రా చిత్రాన్ని థియేటర్లలో చూసి ప్రోత్సహించాలని కోరారు. తన తదుపరి చిత్రం ఫుల్‌బాటిల్ కాకినాడలోనే 30 రోజుల పాటు షూటింగ్ జరుపుకొందని, ఈ చిత్రం ప్రమోషన్‌ను గోదావరి జిల్లాల నుంచే ప్రారంభిస్తామన్నారు. తనకు మంచి పేరు తెచ్చిన బ్లఫ్‌మాస్టర్- 2కి ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ప్రతి నాయకుడి పాత్రలో నటనకు అవకాశం ఎక్కువ ఉంటుందని, కథా నాయకుడి పాత్రకు కొన్ని పరిమితులు ఉంటాయన్నారు. ప్రతి నాయకుడి పాత్ర పోషిస్తే ఏ పాత్రనైనా చేయగలుగుతామన్నారు. తాను ఇప్పటి వరకూ 25 చిత్రాల్లో నటించానన్నారు. హీరోయిన్ జెన్నీఫర్ మాట్లాడుతూ జీబ్రా చిత్రంలో నటించడం ఆనందం సంతోషంగా ఉందని అన్నారు. అనంతరం హాస్యనటుడు భద్రం మాట్లాడారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కాకినాడ క్రైం: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. కాకినాడ ఒకటో పట్టణ పోలీసుల కథనం ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన బెల్లాని సుదర్శన్ (40) కాకినాడకు వచ్చి జగన్నాథపురంలోని తన అమ్మమ్మ ఇంట్లో ఉంటున్నాడు. ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం ఉదయం తన ద్విచక్ర వాహనంపై జగన్నాథపురం కొత్త వంతెనపై వెళ్తూ వార్ఫు రోడ్డు మలుపులో విద్యుత్ స్తంభం సిమెంట్ దిమ్మను ఢీకొని ప్రమాదానికి గురయ్యాడు. ఈ ఘటనలో సుదర్శన్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లా కబడ్డీ జట్టు ఎంపిక



ఉమ్మడి జిల్లా జట్టుతో సెలక్షన్ కమిటీ సభ్యులు

సామర్లకోట: అంతర్ జిల్లాల కబడ్డీ పోటీల్లో భాగంగా ఉమ్మడి జిల్లా మహిళా జట్టును ఆదివారం రాత్రి ఎంపిక చేశారు. మహిళా జట్టులో వీరలక్ష్మి (కిర్లంపూడి), అపరంజిత (జి.మేడపాడు), అరుణ (కాకినాడ), ఉమ (కాకినాడ), మంజుల (పిఠాపురం), పరిమల (రావులపాలెం), వర్షిత (సామర్లకోట), నాగమణి (కాకినాడ), ఆశిక (ప్రత్తిపాడు), రేఖ (కిర్లంపూడి), దీపిక (కాకినాడ), పూర్ణశ్రీ (బిక్కవోలు), జీవనజ్యోతి (కాకినాడ), నందిని (వీకే రాయపురం), భవానీ(సామర్లకోట), శివజ్యోతి (రాజమహేంద్రవరం) ఉన్నారు. పురుషుల జట్టును సోమవారం ఎంపిక చేస్తామని సెలక్షన్ కమిటీ ప్రతినిధి పోతుల సాయి తెలిపారు.